క్లుప్తంగా

ఘనంగా 'గొడుగు' సంఘం వార్షికోత్సవం

ఎంవీపీకాలనీ: శివాజీ పార్కులో ఆదివారం గొడుగు వాకర్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆచార్య వీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో గతేడాది కాలంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. ఈ ఏడాది మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. వాటితోపాటు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేసే కార్యక్రమాలు నిర్వహిస్తామని పలువురు సభ్యులు పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.శివ రామకృష్ణ, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో లక్ష్మికి డాక్టరేట్


ఎం.లక్ష్మి

మహారాణిపేట: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధకురాలు ఎం.లక్ష్మికి ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో జరిపిన పరిశోధనకు ఆమె డాక్టరేట్ అందుకున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని 22 బ్రిడ్జిల వద్ద 44 బోర్‌హోల్స్ నుంచి మట్టి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో అధ్యయనం చేసి మట్టి దృఢత్వాలను గుర్తించారు. ఈమె పరిశోధన అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించడంతోపాటు భారతదేశ పేటెంట్ కార్యాలయం నుంచి 2 పేటెంట్లు కూడా లభించాయి. ఈ సందర్భంగా లక్ష్మిని విభాగ ఆచార్యులు పరిశోధకులు అభినందించారు. డాక్టర్ లక్ష్మి పద్మ ప్రస్తుతం న్యూఢిల్లీలోని ప్రముఖ కంపెనీలో జియో టెక్నికల్ నిపుణురాలిగా పనిచేస్తున్నారు.

ప్రజా కళాకారుడు రాజారావుకు నివాళి


రాజారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా నాట్య మండలి సభ్యులు

ఆరిలోవ: ప్రజా కళాకారుల దర్శకుడు డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతిని ప్రజా నాట్య మండలి సభ్యులు ఆదివారం నిర్వహించారు. ఆరిలోవ బీఎస్ఆర్ నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గరికపాటి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్య మండలి సభ్యులు మాట్లాడుతూ ప్రజలను, కార్మికులను, అన్నదాతలను చైతన్య పరిచడానికి రాజారావు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్య పరిచారని, ఎంతోమంది కళాకారులకు శిక్షణ ఇచ్చారని కొనియాడారు. గరికపాటి ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి సభ్యులు వై.అప్పారావు, ఎస్.సూర్యనారాయణ, రమణ, నరేంద్రకుమార్, మణి, నారాయణరావు, తవిటినాయుడు, లక్ష్మణరావు, చంటి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన దీక్షలు

ఎంవీపీకాలనీ: వాల్తేరు డిపో మేనేజర్, యాజమాన్యం తీరును నిరసిస్తూ ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సంస్థ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం కొనసాగాయి. ప్రజా రవాణా సంస్థ యాజమాన్యం తీరుకు నిరసనగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఉద్యోగులు వాల్తేర్ డిపో ఎదుట దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. డిపో మేనేజర్ వైఖరికి వ్యతిరేకంగా నెల రోజుల నుంచి నిరసన తెలుపుతున్నా.. యాజమాన్యం పట్టనట్టు వ్యవహరించడం తగదని ఉద్యోగులు ధ్వజమెత్తారు. కనీస సమాచారం, విచారణ లేకుండా, నిబంధనలను తుంగలో తొక్కి కండక్టర్‌ను వాల్తేరు డీఎం సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. కండక్టర్‌పై సస్పెన్షన్ ఎత్తేయాలని, వాల్తేరు డిపో పరిధిలోనే ఆయనకు తిరిగి ఉద్యోగ బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ వాల్తేరు డిపో కార్యదర్శి వసంతరావు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో 'బీఆర్‌టీఎస్', వాన వెల్లువ

- వానొస్తే చెరువులా మారుతున్న భారీ రహదారి
- పెదగదిలి వద్ద వెల్లువలా వరద నీరు
- రాకపోకలకు అష్టకష్టాలు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు


బీఆర్‌టీఎస్ రోడ్డులో పెదగదిలి వద్ద చెరువును తలపిస్తున్న వరద నీరు


వరద నీటిలో చిక్కుకున్న వాహనాలు

ఆరిలోవ: ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బీఆర్‌టీఎస్ రహదారి వర్షం పడితే చెరువును తలపిస్తోంది. ఇటుగా రాకపోకలు సాగించే వాహనాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. శీఘ్ర రవాణా వ్యవస్థ పేరుతో ట్రావెల్స్ బస్‌లు, భారీ వాహనాలు, వీవీఐపీ వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా ఈ రోడ్డును ఉపయోగించేలా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ సంయుక్తంగా 2008లో దీని నిర్మాణం చేపట్టాయి. హనుమంతవాక నుంచి అడవివరం వరకు విశాలమైన బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మించారు. హనుమంతవాక నుంచి పైనాపిల్ కాలనీ వరకు ఐదు లైన్లు, అక్కడి నుంచి అడవివరం కూడలి వరకు మూడు లైన్లతో ఈ రహదారి నిర్మాణం చేపట్టారు. ఇంజినీరింగ్ నైపుణ్యం ఉపయోగించి ఎంత వర్షం కురిసినా చుక్క నీరు కూడా ఒక్క నిమిషం పాటైనా రోడ్డు మీద నిల్వ ఉండకుండా దీని నిర్మించదలచారు. దీనికి అప్పట్లో రూ.200 కోట్లు ఖర్చు చేశారు. ఇన్ని రూ.కోట్లతో చేపట్టిన ఈ నిర్మాణం పెదగదిలి వద్ద బెడిసికొట్టేసింది. ఇక్కడ అధికారులు ఉపయోగించిన ఇంజినీరింగ్ నైపుణ్యం నీటిలో కలిసిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా.. పెదగదిలి కూడలిలో వరద నీరు గంటల కొద్దీ నిల్వ ఉండిపోతోంది. భారీ వర్షం కురిస్తే పెద్ద చెరువును తలపించేలా నీరు తొణికిసలాడుతోంది.

నీట మునిగిన వాహనాలు

గత మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు పెదగదిలి కూడలిలో చేరిన వరద నీటిలో వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు. ద్విచక్ర వాహనాల సైలెన్సర్‌లో నీరు చేరిపోయింది. కార్లు, ఆటోల సీట్లు ఎత్తు వరకు మునిగిపోయాయి. పాదచారులు నడవడానికి వీలులేకుండా పోయింది. వర్షం కురుస్తున్న ప్రతి సారీ ఇదే పరిస్థితి నెలకొంటుందని స్థానికులు, వాహన చోదకులు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఇక్కడ రోడ్డు ఎత్తుచేసి కింద నుంచి నీరు పోయేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కొండవాలు నుంచి వరద నీరు

ఇక్కడ కొండవాలు ప్రాంతం ఎక్కువ. వర్షం కురిసినప్పుడు సింహగిరి కాలనీ నుంచి పెదగదిలి వరకు కొండపై నుంచి వచ్చిన వరద నీరు కాలువ ద్వారా పెదగదిలి కూడలిలో చేరుతోంది. ఇక్కడి నుంచి రోడ్డు కింద భాగంలో నిర్మించిన కాలువల ద్వారా విమ్స్ గోడ పక్కన ఉన్న గెడ్డలోకి పారుతోంది. వరద నీరు గెడ్డలోకి ప్రవహించడానికి సరైన డ్రైనేజీ వ్యవస్థను అధికారులు ఏర్పాటు చేయలేదనే అపవాదులు నిర్మాణ దశలోనే తలెత్తాయి. దీంతో కొండవాలు నుంచి వచ్చిన వరద నీరు పెదగదిలి కూడలిలో నిల్వ ఉండిపోతోంది. దానిలో ద్విచక్రవాహనాలు, ఆటోలు మునిగిపోతున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం మూడు రోజుల పాటు కురిసిన వర్షం, ఈ ఏడాది జూన్ మొదటి వారం, జూలై మూడో వారంలో కురిసిన వర్షాలకు పెదగదిలి జంక్షన్ చెరువును తలపించింది. ఈ కూడలిలో రోడ్డు పక్కనున్న బడ్డీలు సైతం మునిగిపోతున్నాయి. బీఆర్‌టీఎస్ రహదారి నిర్మించినప్పటి నుంచి ఇదే పరిస్థితి ఉన్నా.. జీవీఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


వర్షంలో ప్రయాణిస్తున్న వాహన చోదకులు

రోడ్డు భాగం ఎత్తుచేయాలి

పెదగదిలి కూడలిలో రోడ్డు భాగం పల్లంగా ఉంది. దీన్ని ఎత్తు చేసి గతంలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలి. అలా చేస్తేనే కొండవాలు నుంచి వచ్చే వరద నీరు నేరుగా కిందనున్న గెడ్డలోకి చేరుతుంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– జి.శేషగిరిరావు, తోటగరువు

సమస్య పరిష్కరించాలి

వర్షం కురుస్తున్నప్పుడు పెదగదిలి జంక్షన్‌లో నీరు నిలిచిపోతోంది. వర్షం తగ్గాక నీరంతా కిందకు పోయి రోడ్డు మీద బురద చేరుతోంది. దానిలో వాహనాలు జారుతున్నాయి. వాన తగ్గిన మరుసటి రోజు జీవీఎంసీ అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లిపోతున్నారే తప్ప చర్యలు చేపట్టడం లేదు. ఈ సమస్యపై దృష్టి పెట్టి పరిష్కరించాలి.

– పి.త్రినాథరావు, పెదగదిలి

- లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం


ముడసర్లోవ నుంచి వస్తున్న వరద నీటితో ప్రవహిస్తున్న గెడ్డ

ఆరిలోవ: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆరిలోవ ప్రాంతంలో పలుచోట్ల రోడ్లు, లోతట్టు ప్రాంతాలు, ఖాళీ స్థలాలు జలమయమయ్యాయి. ఆదివారం ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో ఆరిలోవతోపాటు విశాలాక్షినగర్, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక, డెయిరీఫారం, జోడుగుళ్లపాలెం తదితర ప్రాంతాల్లో రహదారులపైకి నీరు చేరింది. ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఏదైనా అవసరాల కోసం బయటకు వెళ్లేవారు రెయిన్ కోట్లు, గొడుగులు వేసుకోవాల్సి వచ్చింది. ఆరిలోవ ప్రాంతంలోని గెడ్డల్లో వరద నీరు కిందకు ధారాళంగా ప్రవహించింది. కంబాలకొండల వెనుక భాగం నుంచి వచ్చిన వరద నీరు, ముడసర్లోవ ప్రాంతంలో గెడ్డల ద్వారా ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, శ్రీకాంత్‌నగర్, సూర్యతేజానగర పెదగదిలి, హనుమంతవాక, ఎంవీపీ కాలనీ మీదుగా సముద్రంలో కలుస్తోంది. శ్రీకాంత్‌నగర్, పార్వతీనగర్ మధ్య రోడ్డుపై వరద నీరు నిల్వ ఉండిపోయింది. బీఆర్‌టీఎస్ రహదారి పెదగదిలి కూడలిలో చేరిన వరద నీటిలో వాహన చోదకులు ఇబ్బందిపడ్డారు.

జారిపడిన బండరాయి

హనుమంతవాక వద్ద కొండపై నుంచి జాతీయ రహదారిపైకి రాళ్లు జారిపడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొండవాలు నానిపోయింది. ప్రస్తుతం రెండు రోజులుగా వాన కురుస్తుండటంతో మరింతగా నానిపోయి కొండవాలు నుంచి కొండచరియలు జారిపడుతున్నాయి. శనివారం రాత్రి హనుమంతవాక వద్ద హైవేపైకి పెద్ద బండరాయితోపాటు చిన్న రాళ్లు జారిపడ్డాయి. రాత్రి కావడంతో వాహన చోదకులు లేకపోవడం వల్ల ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రోడ్డు పక్కన ఉన్న ఈ బండరాయి వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది.

తడిసి ముద్దయిన రహదారులు

మద్దిలపాలెం: జోరువానతో రోడ్లు జలమయంగా మారాయి. మద్దిలపాలెం జంక్షన్ తడిసి ముద్దయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీల్లోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. 16వ వార్డు కేఆర్ఎం కాలనీ ఆదివారం కురిసిన వర్షానికి నిండా మునిగింది. నివాసులు ఇబ్బందులకు గురయ్యారు. కేఆర్ఎం కాలనీ నుంచి ఇసుకతోట, రజక వీధి మీదుగా ప్రవహించే గెడ్డలో నీటి ప్రవాహం పెరిగింది. 15వ వార్డు హెచ్‌బీ కాలనీ, కొండవాలు ప్రాంతాలైన సింహాద్రిపురం, దుర్గానగర్, కొత్త వెంకోజీపాలెం వాసులు వర్షాలకు వణుకుతున్నారు. ఏక్షణాన ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయపడుతున్నారు.

పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోళ్లు

23వ వార్డు మద్దిలపాలెంలో కాలువలు, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి. దీంతో కాలువలు, యూడీజీలోని వ్యర్థాలు రోడ్లపైకి వచ్చి చేరుతున్నాయి. వాహన చోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు. మ్యాన్‌హోల్స్ వద్ద ద్విచక్ర వాహనదారులు, పాదచారులు జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. శివాజీపాలెం ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ పొంగింది. ఈ రోడ్డంతా వర్షపు నీటితో నిండిపోయింది. సీబీఎం కాంపౌండ్‌లోని అపార్ట్‌మెంట్ భారీ గోడ కూలిపోయింది. స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.


శ్రీకాంత్‌నగర్-పార్వతీనగర్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


హనుమంతవాక వద్ద కొండపై నుంచి హైవేపై పడిన బండరాయి


రోడ్డుపై పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్


తడిసి ముద్దయిన మద్దిలపాలెం కూడలి

బిక్కు బిక్కుమంటున్న మత్స్యకార గ్రామాలు

- అల్పపీడనంతో తీరంలో ఎగసిపడుతున్న అలలు
- రెండు రోజులుగా ఇళ్లకే పరిమితమైన మత్స్యకారులు


వాసవానిపాలెం తీరంలో ఎగసిపడుతున్న అలలు


తుపాను కారణంగా ఒడ్డుకు చేరిన నాటు పడవలు

ఎంవీపీకాలనీ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో తీరప్రాంత గ్రామాలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. గతంలో హుద్‌హుద్ మిగిల్చిన చేదు అనుభవాల కారణంగా తుపానులతోపాటు తీవ్ర వర్షపాతం అంటేనే తూర్పు నియోజకవర్గ పరిధిలోని మత్స్యకార గ్రామాలు ఉలిక్కి పడుతున్నాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా ఎడితెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. దీంతో తీరంలోని వాసవానిపాలెం, శివగణేష్ నగర్, జాలరిపేట ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సముద్ర కెరటాలు ఉధృతంగా వస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు.

తీరానికి చేరిన నాటు పడవలు

సాగరతీరం జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, వాసవానిపాలెం, శివగణేష్‌నగర్, పెద జాలరిపేట ప్రాంతాల్లో తూర్పు నియోజకవర్గం విస్తరించింది. ఆయా గ్రామాల్లో దాదాపు 5 వేల నుంచి 6 వేల వరకు కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరి ప్రధాన జీవనాధారం చేపల వేట కావడంతో వీరింతా తీరానికి ఆనుకున్న గ్రామాల్లో జీవిస్తున్నారు. ముఖ్యంగా తీరానికి దగ్గరగా ఉన్న వాసవానిపాలెం, శివగణేష్ నగర్ వాసుల పరిస్థితి మరింత దయనీయం. అధికారుల ఆదేశాలకు అనుగుణంగా ప్రస్తుతం చేపల వేటకు వెళ్లకుండా మత్స్యకారులంతా ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో వందల నాటు, డీజిల్ ఇంజిన్ పడవలు ఒడ్డుకు చేరాయి. నాలుగు రోజుల నుంచి ఇక్కడి వారెవ్వరూ చేపల వేటకు వెళ్లలేదు. రెండు రోజులుగా వర్షం కురుస్తున్న నేపథ్యంలో మత్స్యకార గ్రామాలకు ప్రత్యేక సహాయం అందించాలని తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు కోరుతున్నారు. ఏ క్షణాన ఎటువంటి సహాయం అవసరమైన వేగవంతమైన సేవలు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

సమాజంలో బైక్ మెకానిక్‌లకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు

మహారాణిపేట: బైక్ మెకానిక్‌లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, తక్కువ ఆదాయంతో సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రా యూనివర్సిటీ రెక్టార్ ఎస్.కిషోర్‌బాబు అన్నారు. సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఇన్‌క్లూజన్ ఇన్ యూనివర్సిటీస్(సీఎస్ఎస్ఐయూ), ఆంధ్రా యూనివర్సిటీ ఆదివారం 'విశాఖ నగరంలో బైక్ మెకానిక్స్ ఇష్యూస్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించింది. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి రెక్టార్ ప్రారంభించి మాట్లాడారు. బైక్ మెకానిక్‌లకు సమాజంలో ఎంతో ప్రాధాన్యముందన్నారు. మెకానిక్‌లు వృత్తిలో కొనసాగడానికి, వారి ఆదాయం పెంచడానికి వీలు కల్పించే చర్యలు తీసుకోవాలన్నారు. కంపెనీ షోరూమ్స్‌లో నైపుణ్యం గల బైక్ మెకానిక్‌లకు చాలా డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమ అధ్యక్షుడు ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ మెకానిక్స్ రంగాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. సీఎస్ఎస్ఐయూ డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు, స్మార్ట్ సిటీ వైజాగ్ స్కూటర్ అండ్ బైక్ టెక్నీషియన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డి.వాసుదేవరాజు, అధ్యక్షుడు కె.బ్రాహ్మజీ, కోశాధికారి బి.సురేష్ తదితరులు హాజరైన ఈ కార్యక్రమానికి సీఎస్ఎస్ఐయూ డాక్టర్ జె.ఎస్.రాణి వందన సమర్పణ నిర్వహించారు. వర్క్‌షాప్‌లో స్టాప్ సెంటర్‌కు చెందిన డాక్టర్ జి.శాంతారావు, శోభ, ఇ.ప్రతాప్, 60 మంది బైక్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి ఆశ్రయం


మతిస్థిమితం లేని వ్యక్తిని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో చేర్పిస్తున్న ఎంవీపీ పోలీసులు

అల్లిపురం: మతిస్థిమితం లేని ఓ వ్యక్తికి ఎంవీపీ పోలీసులు ఆశ్రయం కల్పించారు. వినాయక చవితి సందర్భంగా శనివారం రాత్రి పోలీస్ కమిషనర్ నగరంలోని మండపాలు, నిమజ్జన ప్రాంతాలను పర్యవేక్షించారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో లాసన్స్‌బే కాలనీ బీచ్‌రోడ్డు వద్ద రాత్రి ఒంటి మీద దుస్తులు లేకుండా వర్షంలో తడుస్తున్న నడి వయసు వ్యక్తిని గమనించారు. తక్షణమే ఆయన ఎంవీపీ పీఎస్ ఎస్‌హెచ్‌వోకు ఫోన్ చేసి ఆ వ్యక్తికి తిండి, నీళ్లు, దుస్తులు అందించి ఆశ్రయం కల్పించాలని ఆదేశించారు. ఫొటో తీసి పంపించాలని సూచించారు. ఎంవీపీ పోలీసులు మతిస్థిమితం లేని వ్యక్తి వద్దకు చేరుకుని తాగునీరు, దుస్తులు, ఆహారం అందించారు. పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన ఆశ్రమంలో అతడిని చేర్పించారు.

ఏకదంతాయ.. విభిన్న రూపాయ

- ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు
- ఆకర్షిస్తున్న స్వామి విగ్రహాలు, పందిళ్లు


రేసపువానిపాలెంలో శివగణపతి


పీతలవానిపాలెంలో వినాయక మండపం


ఆరిలోవ సూర్యతేజనగర్‌లో ఇగ్లూ ఆకారంలో వినాయక పందిరి

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా ఏర్పాటు చేసిన వివిధ రకాల పందిళ్లు, మండపాల్లో గణనాథుడిని ప్రతిష్టించి రోజంతా ప్రత్యేక పూజలు చేశారు. ఆరిలోవ ప్రాంత వాసులు భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుడిని కొలిచారు. ఇళ్లలో మట్టి ప్రతిమలు పెట్టి ఉపవాసాలతో పూజలు చేశారు. ఇక్కడ వివిధ ఆకారాల్లో రూపొందించిన పందిళ్లు స్థానికులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది. దారపాలెం నుంచి పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, ఎస్.ఎస్.ఎన్ నగర్, రామకృష్ణాపురం, దీన్‌దయాల్‌పురం, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక, ఆరిలోవ కాలనీ నుంచి దుర్గాబజార్, టీబీసీ పాయింట్, బాలాజీనగర్, పార్వతీనగర్, సూర్యతేజ నగర్, గాంధీనగర్, తోటగరువు, డెయిరీఫారం, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం పలుచోట్ల బుర్రకథ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని చోట్ల తొలిరోజే వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ ప్రాంతంలో సుమారు 120 వరకు విగ్రహాలు ఉన్నట్లు ఆరిలోవ పోలీసులు తెలిపారు.

వాడవాడలా కొలువుదీరిన గణనాథుడు

మద్దిలపాలెం: వినాయక చవితి ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. వాడవాడలా గణనాథుడు కొలువుదీరాడు. జోరువాన కురుస్తున్న లెక్కచేయకుండా కమిటీ కుర్రాళ్లు నవరాత్రి ఉత్సవాలను హుషారుగా నిర్వహిస్తున్నారు. 15, 16, 23, 22 వార్డుల్లో ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన మండపాల్లో ప్రతిష్టించిన వినాయకుడి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వీధులను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. మద్దిలపాలెం కృష్ణా కళాశాల దరి లక్ష్మీగణపతి ఆలయం వద్ద నిర్మించిన హోమశాలలో తొమ్మిది రోజుల పాటు హోమాలు నిర్వహిస్తున్నారు. శివాజీపాలెం ప్రధాన రహదారి పక్కన గల గణపతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పీతలవానిపాలెం, పిఠాపురం కాలనీ మార్కెట్, మద్దిలపాలెం, ఇసుకతోట, హరిజన వీధి, రజక వీధి, హెచ్‌బీ కాలనీ, కేఆర్ఎం కాలనీ ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకుంటున్న క్యారమ్ బోర్డు వినాయకుడు

జీవీఎంసీ 16వ వార్డు పాత వెంకోజీపాలెంలో రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్కే వైఎస్ బాయ్స్ ఏర్పాటు చేసిన క్యారమ్ బోర్డు వినాయకుడు విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. ఈ మండపాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. నవరాత్రులు ప్రసాద వితరణ చేస్తామని ఉత్సవ నిర్వాహకులు పల్లా భాను, బోరా సందీప్, జోగా నాని, ఒమ్మి గణేష్, ఒమ్మి భార్గవ్, వంశీ, శ్యామ్ తెలిపారు.

ఏకదంతుడికి విశేష పూజలు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో కొలువుదీరిన ఏకదంతుడికి విశేష పూజలు నిర్వహించారు. రామ్‌నగర్ భార్గవి బాయ్స్ హాస్టల్‌లో ప్రతిష్టించిన వినాయక విగ్రహాన్ని, రామ్‌నగర్ బజార్‌లో కేఎస్ఆర్ కూల్ గైస్ మండపంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


విశాలాక్షినగర్‌లో కొలువైన గణనాథుడు


శివాజీపాలెం గణపతి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


రామ్‌నగర్‌లో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న పల్లా దుర్గారావు

ముట్టుకుంటే ముప్పే..!

- ముడసర్లోవ పార్కులో ప్రమాదకరంగా విద్యుత్ బాక్స్‌లు


బాక్స్ నుంచి వేలాడుతున్న విద్యుత్ వైర్లు

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం ముడసర్లోవ పార్కులో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. ఈ పార్కులోని విద్యుత్ దీపాలకు స్తంభాలు ఏర్పాటు చేశారు. వాటికి విద్యుత్ లైన్ కోసం మధ్యమధ్యలో బాక్స్‌లు అమర్చారు. వాటిల్లో వైర్లు అతికించి మూతలు వేశారు. ఇప్పుడా బాక్సులు తుప్పుపట్టిపోయాయి. మూతలు పాడైపోవడంతో లోపల ఉన్న వైద్యుత్ తీగలు బయటకు వేలాడుతున్నాయి. ఇవి రెండడుగుల ఎత్తులో చిన్న పిల్లలకు సైతం అందేలా ఉన్నాయి. వీటిలో ఓ బాక్సు పార్కు మధ్యలో పిల్లలు ఆడుకునే చోట ఉంది. ఇది ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఎవరికి తగిలినా ప్రాణాపాయం తప్పదని సందర్శకులు అంటున్నారు. ఈ బాక్సులకు నిరంతరం మూతలు వేసి దానిని ముట్టుకోకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను పార్కుకు వచ్చే సందర్శకులు కోరుతున్నారు.